# ప్రత్యేక అధికారులతో అభివృద్ధి జరిగేనా?



## అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు అయ్యేనా?

మేడ్చల్, జూలై 13(నమస్తే తెలంగాణ): ప్రత్యేక పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలయ్యేనా? అన్న అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు తీరును మండలాల్లో పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులను నియమించారు. అభివృద్ధి పనులు, పథకాలను ప్రజలందరికి అందించేలా ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. సంబంధిత ఉద్యోగుల పనితీరును మెరుగుపర్చే లక్ష్యంగా జిల్లాలోని 15 మండలాల్లో నియమించిన ప్రత్యేక అధికారులు వారంలో రెండు రోజులు పర్యటించాల్సి ఉంటుంది. ప్రత్యేక అధికారులుగా జిల్లా అధికారులను నియమించిన క్రమంలో జిల్లా కలెక్టరేట్ కార్యకలాపాలతో పాటు ప్రత్యేక అధికారుల విధులు నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో పూర్తి స్థాయిలో ప్రత్యేక అధికారులు మండలాలపై దృష్టి సారించలేరన్న అనుమానలు వ్యక్తమవుతున్నాయి. మండలాల పరిధిలో అభివృద్ధి, ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో ప్రత్యేక అధికారులకు సమయం అంత అంత మాత్రంగా ఉంటున్న నేపథ్యంలో ఎలా అమలు జరుగుతున్నదనేది ప్రశ్నార్థకంగా మారనుంది. అంతేకాక మండలాల నుంచి వచ్చే ఫిర్యాదులు అభివృద్ధి పనుల పథకాల్లో నెలకొన్న సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు నివేదికలను సమర్పించాల్సి ఉంటుంది.

**ప్రత్యేక అధికారులు నిర్వహించాల్సిన విధులు**

జిల్లాలోని 15 మండలాలకు నియామకమైన ప్రత్యేక అధికారులు మండలాల పరిధిలోని సమస్యలను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సి ఉంటుంది. ప్రతి మంగళ, శుక్రవారాలలో ప్రత్యేక అధికారులు పర్యటించాలి. ప్రభుత్వ ప్రాధాన్యతలకు సంబంధించిన విషయాల నివేదికలను సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు సమర్పించాల్సి ఉంటుంది. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల తీరులో నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై చర్యలు తీసుకునే అవకాశాలను ప్రత్యేక అధికారులకు కల్పించారు. అయితే, ప్రత్యేక అధికారులు పాలన ఆరు రోజుల క్రితం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఎంత వరకు ప్రజల సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలు ఏ మేరకు అందుతాయన్నది వేచి చూడాల్సిందే.

## జగదాంబిక అమ్మవారికి నేడు మూడో బోనం

మెహిదీపట్నం, జూలై 13: చారిత్రాత్మక గోల్కొండ కోట జగదాంబిక మహంకాళి ఎల్లమ్మ ఆలయంలో ఆషాఢ మాసం బోనాలలో భాగంగా ఆదివారం మూడో బోనం పూజ జరగనున్నది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో పుష్పాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా ఉండనుంది. మూడో బోనం సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి తొట్టెల ఊరేగింపులు వస్తాయి. వీటిలో పురానాపూల్ నుంచి సంఘ సేవకులు ఎంపీ భీష్మ నిర్వహించే తొట్టెల ఊరేగింపు ప్రత్యేకంగా ఉంటుంది. ఇదిలా ఉండగా, ఆదివారం భక్తులకు ఎలాంటి సమస్యలు లేకుండా అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులు శనివారం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయం వద్ద పుష్పాలంకరణను బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కాంత అరవింద్ మహేష్ కుమార్ శనివారం పర్యవేక్షించారు. నీటి సమస్యలు లేకుండా ఉండటానికి ట్యాంకుల సంఖ్యను పెంచారు. ఈ పనులను జల మండలి డీఓపీ వినోద్ భార్గవ్ మేనేజర్ సాజిద్ అలీతో కలిసి పరిశీలించారు. భద్రతా లోపాలు లేకుండా ఉండటానికి భారీ బందోబస్తుకు దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ చంద్రమోహన్ పర్యవేక్షణలో గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ చర్యలు చేపట్టారు.

## పదవీ విరమణ 65 ఏండ్లకు పెంచాలి

**సీఎంను కలిసిన టౌటా ప్రతినిధులు**

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 13: తెలంగాణ ఆల్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టీఏయూటీఏ) ప్రతినిధులు శనివారం సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ఈసందర్భంగా సీఎంకు వినతిపత్రం అందజేశారు. యూజీసీ గైడ్‌లైన్స్ ప్రకారం, పదవీ విరమణ వయస్సును 65ఏండ్ల వరకు పెంచాలని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని కోరారు. అదే విధంగా యూనివర్సిటీలలోని పోస్టులను భర్తీ చేయాలని, యూనివర్సిటీ ఉద్యోగులకు ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. సమస్యలను పరిష్కరించి, యూనివర్సిటీలను బలోపేతం చేసే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ప్రొ.జి.మల్లేషం, ప్రధాన కార్యదర్శి డా.చలమల్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ప్రొ.సరస్వతమ్మ, ప్రొ. మంగు, డా. వనజ ఉదయ్, సైదానాయక్, మాధవి కుమారి, డా.ప్రశాంతి, డా.మధు పాల్గొన్నారు.

## ఐఐసీటీలో వన్ వీక్ వన్ థీమ్ కార్యక్రమం

సిటీబ్యూరో, జూలై 13(నమస్తే తెలంగాణ): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో రేపటి నుంచి వన్ వీక్ వన్ థీమ్ కార్యక్రమానికి షెడ్యూల్ విడుదల చేశారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బల్క్ డ్రగ్ మేనుఫ్యాక్చరర్ అసోసియేషన్ జాతీయ ప్రెసిడెంట్ ఆర్‌కే అగర్వాల్, కాస్మిక్ థెరప్యాటిక్స్ డైరెక్టర్ ప్రొ.జావెద్ ఇక్బాల్ పాల్గొనున్నారు. వన్ వీక్ వన్ థీమ్ కార్యక్రమంలో భాగంగా కెమికల్స్ అండ్ పెట్రో కెమికల్స్ అంశంపై నిపుణులతో చర్చాగోష్టిలు, ఉపన్యాసాలు ఉంటాయని ఐఐసీటీ వర్గాలు పేర్కొన్నాయి.

## గిరి ప్రదక్షిణకు స్పెషల్ బస్సులు

**గురుపౌర్ణమి నేపథ్యంలో ఎంజీబీఎస్ నుంచి సర్వీసులు**

సుల్తాన్‌బజార్, జూలై 13: గురుపౌర్ణమిని పురస్కరించుకొని అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం టీజీఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ శ్రీలత శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 19న రాత్రి 8 గంటలకు ఎంజీబీఎస్ నుంచి అరుణాచలానికి సెప్షల్ సర్వీసులు ప్రారంభమవుతాయని, 20న చిత్తూరు జిల్లా కాణిపాకం చేరుకుంటుందని, అక్కడ వినాయక ఆలయాన్ని దర్శించుకున్న అనంతరం తమిళనాడు వేలూరులోని స్వర్ణ దేవాలయం(గోల్డెన్ టెంపుల్)లో దర్శనం ఉంటుందన్నారు. ఆ తర్వాత 21న గురుపౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరి ప్రదర్శన అనంతరం సాయంత్రం 5 గంటలకు బయలుదేరి.. 22న ఉదయం 6 గంటలకు తిరిగి హైదరాబాద్‌కు బస్సులు చేరుకుంటాయన్నారు. గిరి ప్రదర్శనకు వెళ్లే భక్తులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ స్పెషల్ బస్సుల టికెట్ బుకింగ్ కోసం www.tsrtconline.in లో లేదా టీజీఆర్‌టీసీ అన్ని కౌంటర్‌ల్లో బుక్ చేసుకోవచ్చన్నారు. అరుణాచలం వెళ్లే భక్తులు ఒక్కొక్కరికీ రూ. 3700 టికెట్ చార్జీ ఉంటుందన్నారు.

## చట్ట సభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు తీసుకురావాలి

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య**



అభివాదం చేస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

రవీంద్రభారతి, జూలై 13: పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీల అభివృద్ధికై కేంద్ర ప్రభుత్వం రెండు లక్షల కోట్లు బడ్జెట్ కేటాయించాలని ఆగస్టు 6న చలో పార్లమెంట్ ఉద్యమ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీ సంఘాల కోర్ కమిటీ నాయకుల సమావేశం జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు గవ్వల భరత్ అధ్యక్షతన శనివారం సమావేశాన్ని నిర్వహించి ఈ నిర్ణయం తీసుకున్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. ఈ నెల 22వ తేదీ నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాలలోనే బీసీ బిల్లును ప్రవేశ పెట్టి బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక, రాజకీయ రంగాలలో జనాభా ప్రకారం, వాటా ఇచ్చే విధంగా బీసీల బిల్లు ప్రవేశ పెట్టాలని కోరారు. రాజ్యాంగంలో పేర్కొన్న సమానత్వం, సామాజిక న్యాయం 76 ఏండ్ల తరువాత కూడా అమలు కావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల సేకరించిన గణాంకాల ద్వారా రాజకీయ రంగంలో బీసీల ప్రాతినిధ్యం 14 శాతం దాటలేదని, దీంతో బీసీలకు ఎంత అన్యాయం జరిగిందో తెలుస్తుందన్నారు. బీసీలకు కేంద్ర విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను బీసీల జనాభా ప్రకారం 27 శాతం నుంచి 56 శాతానికి పెంచాలని కోరారు. ప్రతి సంవత్సరం ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో బీసీలకు రెండు లక్షల కోట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మాదిరిగా బీసీలకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి బీసీ యాక్ట్‌ని తీసుకురావాలని కోరారు. ఆందోళన కార్యక్రమానికి కాంగ్రెస్, సమాజ్ వాది పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్, డీఎంకే, అన్నా డీఎంకే, జనతాదళ్ తదితర పార్టీలను ఆహ్వానిస్తున్నామన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టి పార్లమెంట్ ముట్టడించడానికి కూడా వెనకాడమని హెచ్చరించారు.



రోజురోజుకు పెరుగుతున్న ఇంధనం ధరలతో విసిగిపోయిన ప్రజానీకం ప్రత్యామ్నాయ ఏర్పాట్లను అన్వేషిస్తున్నారు. దానిలో భాగంగా ఇటీవల మార్కెట్లోకి విడుదలైన ఎలక్ట్రిక్ వెహికిల్స్ తోపాటు గ్యాస్ వాహనాలను సైతం వాహనాదారులు వాడుతున్నారు. అయితే ఇక్కడ కనిపించే కొత్త మోడల్ ఎలక్ట్రిక్ వాహనం ఇటీవల మార్కెట్‌లోకి వచ్చింది. శనివారం నగరంలోని రాయదుర్గం పరిధిలోని గౌలిదొడ్డి ప్రాంతంలో ఇలా రోడ్లపై దూసుకెళ్తూ పలువురిని ఈ వాహనం ఆకర్షించింది.

## 22 నుంచి డీప్‌టెక్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్

సిటీబ్యూరో, జూలై 13(నమస్తే తెలంగాణ): టెక్నాలజీ స్టార్టప్‌లకు టీ హబ్ అధిక ప్రాధాన్యతనిస్తోంది. అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలతో కొత్తగా స్టార్టప్‌లను ఏర్పాటు చేసిన వారికి పూర్తి స్థాయిలో సహాయ సహకారాలను అందించేందుకు ప్రత్యేకంగా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. తాజాగా బీవీఆర్ సైయింట్‌తో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైదరాబాద్‌లో నాలుగు రోజుల పాటు వర్క్‌షాపును నిర్వహించనున్నారు. డీప్ టెక్ విభాగంలో ఉన్న అవకాశాలు, సవాళ్లపై నిపుణులతో విద్యార్థులు, ఆంత్రప్రెన్యూయర్స్, స్టార్టప్ వ్యవస్థాపకులు చర్చించే అవకాశం ఉంటుందని, రిజిస్ట్రేషన్లకు (https://bit.ly/3xSWSQA)లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

## తేనెటీగల పెంపకంతో అనేక లాభాలు

**కేఎల్టీ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డా. నీరజా ప్రభాకర్**




తేనె టీగల పెంపకం శిక్షణ ముగింపు కార్యక్రమంలో నీరజా ప్రభాకర్ తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, జూలై 13: తేనెటీగల పెంపకం మనతోపాటు ప్రకృతి పర్యావరణానికి తోడ్పాటునందిస్తుందని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. నీరజా ప్రభాకర్ అన్నారు. రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన తేనెటీగల పెంపకం ముగింపు సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తేనెటీగల పెంపకం ప్రస్తుత గడ్డు పరిస్థితులలో ఎంతో అవసరమన్నారు. ప్రధానంగా రైతులు, యువత ముందుకు రావాలన్నారు. గతంలో చిట్టడవులలో సైతం చిన్న తేనెలు సహజంగా పెట్టేవని, చాలా నాణ్యతతో పాటు మన పంటలపై వాటి ప్రభావం ఉండేదన్నారు. ఇప్పుడు రాను రాను అంతరించి పోయాయని, ప్రకృతి మనుగడకే ప్రమాదకరమైన ప్రస్తుత పరిస్థితులలో తేనెటీగల పెంపకం అత్యవసరం, నాణ్యత గల తేనెకు అధిక డిమాండ్ ఉందన్నారు. తేనెటీగల పెంపకం ఆవశ్యకత, శాస్త్రీయ పద్ధతులు, పెంపకం, లాభాలు, తదితర అంశాలపై నిపుణులు పాల్గొని శిక్షణ ఇచ్చారు. ఈనెల 8న ప్రారంభమై వారం రోజులు పాటు జరిగింది. ఉద్యాన పరిశోధనా స్థానం అధిపతి డా. అనితా కుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బోధనా, బోధనేతర సిబ్బంది, రాష్ట్రంలోని ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి, మెదక్, తదితర జిల్లాల నుంచి రైతులు, యువత పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఎందుకిలా..? యువతా మేలుకో..!



"యువతలో మార్పు రావాలి.. యువతరం రేపటి భావి భారతం... నేటి యువకులే.. దేశ భవిష్యత్తుకు పునాదులు, యువతరం గళమెత్తితే.. ఈ లోకమే మారిపోదా.." లాంటి కొటేషన్లు పాఠశాలల్లో, కళాశాలల్లో, గొప్ప గొప్ప వ్యక్తుల ప్రసంగాలలో, అద్భుతమైన గాయకుల గానంలో ఎన్నో విన్నాం..వింటున్నాం. అయినా మన పయనం ఎటుపోతుందో తెలియడం లేదు. ఒకరు చేస్తున్న అనాలోచిత, వెకిలి చేష్టలకు ఎందరో బలైపోతుంటారు. ఎవరి బతుకుల్లోనో చీకట్లు క్రమ్ముకుంటాయి. మరెవరి జీవితాలో ఛిద్రమైపోతుంటాయి. అయితే, ఇటీవల నాయిని నర్సింహారెడ్డి స్టీల్ బ్రిడ్జిపై కొందరు యువకులు రాత్రి అరాచకం సృష్టిస్తూ, నానా బీభత్సం చేస్తున్నారు. అలాగే, వాళ్లు చేస్తున్న వికృత చేష్టలు వారికి సంతోషం, మహదానందం కలిగిస్తుండొచ్చు. కాని, వారు తాగి పడేసిన మందు బాటిళ్లు గాలి వాటానికి బ్రిడ్జిపై తాండవం చేస్తున్నాయి. బ్రిడ్జిపై నుంచి వచ్చి పోయే వాహనాలకు అవి ఆటంకంగా మారుతున్నాయి. బ్రిడ్జిపై వేగంగా వెళ్లే వాహనాలు సీసాలపై ఎక్కి వాహనదారులు స్కిడ్డై పడిపోతున్నారు. ప్రమాదాలకు గురవుతున్నారు. మరి కొందరి జీవితాలు ప్రమాదాలతో అంధకారంలోకి నెట్టివేయబడుతున్నాయి. ఈ ప్రమాదాలు మన ఇంట్లో వాళ్లకు కూడా తారసపడొచ్చు. అందుకే, యువకులారా మేల్కోండి.. ఇది పద్ధతి కాదు. అని.., ఆ సందర్భంలో ఎవ్వరైనా సాహసించి చెబితే.. వారిపై దాడికి పాల్పడుతున్నారు. ఈ తతంగంపై సోషల్ మీడియా, నెటిజన్లు పలు రకాలుగా పోస్టులు పెట్టినా.. అధికార యంత్రాంగానికి, పోలీసు వ్యవస్థకూ పట్టదు.

## ఉజ్జయిని బోనాలను వైభవంగా జరుపుకుందాం

**ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**



దేవాలయం ప్రాంగణంలో అధికారులకు తగిన సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే తలసాని

బేగంపేట్, జూలై 13: ఈ నెల 21వ తేదీన జరిగే సికింద్రాబాద్ బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించుకుందామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయ పరిసరాలలో శనివారం పర్యటించి 21వ తేదీన జరిగే బోనాల ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, మహంకాళి అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తారని, వారు ఎలాంటి అసౌకర్యానికి, ఇబ్బందులకు గురి కాకుండా శాఖల మధ్య సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. 22న రంగం అంబారీపై అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అమ్మవారి దర్శనం సందర్భంగా క్యూ లైన్‌లలో ఎలాంటి తోపులాటకు అవకాశం లేకుండా పటిష్టమైన బారికేడ్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆలయ పరిసరాలలో ప్రత్యేక హెల్త్‌క్యాంపులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర పండుగగా ప్రకటించిన తర్వాత బోనాల విశిష్టత మరింత పెరిగిందన్నారు. బోనాల ఉత్సవాలలో భక్తులకు సేవలు అందించే వాలంటీర్లకు ఫొటోలతో కూడిన ప్రత్యేక పాసులను జారీ చేయాలని పోలీసులను ఆదేశించారు. శాంతి భద్రతల పర్యవేక్షణకు అదనపు పోలీస్ సిబ్బంది నియామకంతో పాటు సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బేగంపేట్ సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య, అదనపు డీసీపీ అశోక్, ఏసీపీ సర్దార్ సింగ్, ఇన్‌స్పెక్టర్ పరశురాం, జల మండలి జీఎం వినోద్ కుమార్, బేగంపేట్ కార్పొరేటర్ మహేశ్వరి, మాజీ కార్పొరేటర్లు కిరణ్మయి, మల్లికార్జున్ గౌడ్, స్థానిక నాయకులు అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరికృష్ణ పాల్గొన్నారు.

## బాలికల ఆశ్రమంలో ఆకర్షణ 14వ లైబ్రరీ



బోయిగూడలో 14వ లైబ్రరీ ప్రారంభించిన ఆకర్షణ, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు

బన్సీలాల్‌పేట్, జూలై 13: పుస్తక పఠనం ద్వారా జ్ఞాన వికాసం జరుతుందని, సేవా దృక్పథంతో చిన్న వయస్సులో 14 లైబ్రరీలను ఏర్పాటు చేసిన ఆకర్షణ అందరికీ ఆదర్శంగా నిలిచిందని పలువురు వక్తలు అభినందించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ఆకర్షణ సతీశ్ శనివారం న్యూబోయిగూడలోని ఆక్సిలియమ్ నవజీవన్ బాలికల అనాథాశ్రమంలో 14వ లైబ్రరీని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా యునిసెఫ్ ప్రోగ్రామ్ మేనేజర్ డేవిడ్ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు తన్నీరు ప్రమోద, విజయ్ భాస్కర్, సయ్యద్ నబీ, జీవిత, ఇఫ్లూ రైటైర్డ్ సహాయ ప్రొఫెసర్ ప్రపుల్ల చంద్రలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆకర్షణ మాట్లాడుతూ, ఇప్పటి వరకు తొమ్మిది వేల పుస్తకాలను సేకరించి, 14 ఓపెన్ లైబ్రరీలను ఏర్పాటు చేశానన్నారు. 25 చోట్ల లైబ్రరీలను ఏర్పాటు చేయాలని సంకల్పించానన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడి, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తనను పిలిచి అభినందించడం మరచిపోలేనన్నారు. ఆకర్షణ తండ్రి సతీశ్ కుమార్ మాట్లాడుతూ ఆక్సిలియమ్ నవజీవన్ బాలికల అనాథాశ్రమంలో ఉంటున్న 45 మంది బాలికలకు తన సొంత ఖర్చులతో ఉచితంగా వైద్య బీమా పాలసీ చేయిస్తానని ప్రకటించారు. దాతలకు అనాథాశ్రమ నిర్వాహకులు ధన్యవాదములు తెలిపారు.

# స్టాన్లీలో చదివితే.. జాబ్ పక్కా

- 'ఇక్కడ చదివితే మంచి ప్యాకేజీ ఖాయం' అంటున్న యువత
- ఒక యువతికి రూ.30 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం.. ఇంకా ఇలాంటివెన్నో...
- అత్యధిక ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులు
- 'ఎంపవర్ ది ఉమెన్.. ఎన్‌రిచ్ ది వరల్డ్' అనే నినాదంతో కళాశాలను స్థాపించాం : కరెస్పాండెంట్ కృష్ణారావు




స్టాన్లీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులతో కళాశాల కరెస్పాండెంట్ కె కృష్ణారావు

అబిడ్స్, జూలై 13: నగరం నడి బొడ్డున 2008వ సంవత్సరంలో స్థాపించిన స్టాన్లీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు రోజు, రోజుకు ఆదరణ పెరుగుతోంది. 2018వ సంవత్సరంలో ఎన్‌బీఏ అక్రిడిటేషన్‌ను పొందగా, 2019 లో న్యాక్, 2021 కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా లభించి నగరంలో ప్రఖ్యాత కళాశాల స్థాయిలో నిలిచింది. అంతే కాకుండా ఉత్తమ మహిళా ఇంజనీరింగ్ కళాశాలగా ఐఎస్‌టీఈ నుంచి జాతీయ అవార్డును సొంతం చేసుకుంది. కళాశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థినులు ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని ఉద్యోగాలను సాధించి ఉన్నతంగా స్థిరపడుతున్నారు. నగరంలోని అబిడ్స్ చాపెల్ రోడ్డులో ఏర్పాటైన కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ ర్యాంకులు సాధించడమే కాకుండా మంచి ఉత్తీర్ణతా శాతాన్ని పొందుతున్నారు. ప్రతి సంవత్సరం విదేశాలకు చెందిన కార్పొరేట్ కంపెనీలు కళాశాలలో నిర్వహించే క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లలో విద్యార్థులు పాల్గొని ఉద్యోగాలను సాధిస్తున్నారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు అత్యధిక ప్యాకేజీల కింద ఉద్యోగాలు సాధించారంటే అతిశయోక్తి కాదు. సుహృద్భావ వాతావరణం, సువిశాలమైన స్థలంలో ఈ కళాశాలను స్థాపించడంతో పాటు విశాలమైన తరగతి గదులు, విశాలమైన లైబ్రరీ హాల్, అత్యాధునిక డిజిటల్ లైబ్రరీ సదుపాయాన్ని కల్పించడంతోపాటు మంచి కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యను అందించే విధంగా కళాశాల యాజమాన్యం ఏర్పాట్లు చేపట్టింది. ఉస్మానియా యూనివర్శిటీ అనుబంధంతో స్థాపించిన ఈ కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు వేలాది మంది దేశ, విదేశాలలో స్థిరపడ్డారు. కళాశాల కరెస్పాండెంట్ కె.కృష్ణారావు ప్రత్యేక చొరవ తీసుకుని ఎంతో పరిణతి పొందిన ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ద్వారా విద్యార్థులకు విద్యా బోధన చేయించడంతో పాటు వారు ఇంజనీరింగ్ పూర్తయ్యే లోపు ఉద్యోగాన్ని సాధించేలా తీర్చిదిద్దుతున్నారు.

**క్యాంపస్ రిక్రూట్‌మెంట్.. కంపెనీలు...**

స్టాన్లీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రతి సంవత్సరం దేశ, విదేశాలకు చెందిన కంపెనీలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్నాయి. టెక్ మహీంద్రా, అమెజాన్, హెచ్‌సీఎల్, మ్యు సిగ్మా, హెచ్‌పీఈ, పబ్లిసిస్ సపియెంట్, ఇంటెల్, ఫ్లిప్‌కార్ట్, ఎక్స్‌పీరియన్, సేల్స్ ఫోర్స్, సిలికాన్ ల్యాబ్స్, ఎస్‌ఏపీ, బ్లూ సీ ఇండస్ట్రీస్, జీనోసిస్, విప్రో, ఐబీఎం, హిందుస్థాన్ గ్లోబల్, ఓస్మోసిస్, నెట్‌లిక్సిర్, ఐసీఐసీఐ, జెన్ ప్యాక్ట్ కంపెనీలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తోంది. ఓ విద్యార్థిని అత్యధికంగా రూ.30 లక్షల ప్యాకేజీకి ఎంపికయ్యింది. మరో విద్యార్థిని రూ.22 లక్షలు, ఇలా విద్యార్థులు పెద్ద మొత్తం ప్యాకేజీలతో ఉద్యోగాలను సాధించారు.

### ఇక్కడ చదివిన వారికి ఉద్యోగం పక్కా..

అబిడ్స్ చాపెల్ రోడ్‌లోని స్టాన్లీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సీటు దొరికిందంటే ఉద్యోగం పక్కా.. అనే విధంగా విద్యార్థులు ఇక్కడ చదువుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. 2008వ సంవత్సరంలో ప్రారంభమైన ఈ కళాశాలలో ప్రతి సంవత్సరం విద్యార్థులు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ద్వారా ఉద్యోగాలను సాధిస్తున్నారు. ప్రతి సంవత్సరం వందలాది మంది విద్యార్థినులు ఉద్యోగాలను సాధిస్తున్నారు. దేశ, విదేశాలకు చెందిన కార్పొరేట్ సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఈ కళాశాలలో ప్రత్యేకంగా క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌ను నిర్వహించి విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తున్నారు. ఆయా ఉద్యోగాలకు ఎంపికైన వారు అత్యధికంగా 30 లక్షల ప్యాకేజీకి వెళ్లడం గమనార్హం. వంద శాతం ప్లేస్‌మెంట్ కల్పించేందుకు యాజమాన్యం కృషి చేస్తూ వస్తోంది. ఇందులో భాగంగా సీఆర్‌టీ తరగతులను నిర్వహించి విద్యార్థులు క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఉద్యోగం సాధించేలా ప్రొఫెసర్లు తీర్చిదిద్దుతున్నారు.

### మా కళాశాలలో.. ఉద్యోగాలు పొందేలా పరిణతి కల్పిస్తున్నాం



మహిళలను శక్తివంతం చేసి ప్రపంచాన్ని సుసంపన్నం చేయాలని మహిళా ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించాం. మా కళాశాలలో విద్యార్థులు ఉద్యోగాలు పొందేలా పరిణతి కల్పిస్తున్నాం. వారికి సీఆర్‌టీ తరగతులను నిర్వహించడంతో పాటు కంపెనీల వారు నిర్వహించే పరీక్షలలో సునాయాసంగా నెగ్గేలా మా కళాశాల ప్రొఫెసర్ల ద్వారా చర్యలు తీసుకుంటున్నాం. నగరం నడిబొడ్డున ఉన్న మా కళాశాలలో విద్యనభ్యసించి అత్యధిక ప్యాకేజీ కింద విద్యార్థినులు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎంపికయ్యారు. తమ కళాశాలలో చేరిన విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తున్నాం. సువిశాలమైన స్థలంలో ఏర్పాటైన కళాశాలలో విశాలమైన తరగతి గదులు, అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు, వేలాది పుస్తకాలతో లైబ్రరీ సదుపాయాన్ని కల్పించాం. దీంతో పాటు కాన్ఫరెన్స్ హాల్‌లో పలు సమావేశాలు నిర్వహిస్తున్నాం. – కె.కృష్ణారావు, కరస్పాండెంట్, స్టాన్లీ ఇంజనీరింగ్ కళాశాల

### రూ.30 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాన్ని సాధించా..



స్టాన్లీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ కోర్సులో చేరి కష్టపడి చదువుకున్నాను. ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రోత్సాహంతో మ్యు సిగ్మాలో సాలీనా ఏడాదికి రూ.ముప్పై లక్షల ప్యాకేజీతో ఉద్యోగాన్ని సాధించాను. తనకు ఇంజనీరింగ్ విద్యాబోధనతో పాటు సీఆర్‌టీ తరగతులను నిర్వహించి క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో నిర్వహించే పరీక్షలో సునాయాసంగా పాసయ్యేలా ప్రొఫెసర్లు తీర్చిదిద్దారు. అంతే కాకుండా, నగరం నడిబొడ్డున కళాశాల ఉండగంతో గంటల తరబడి ప్రయాణం చేసే అవసరం లేకుండా సమయానికి కళాశాలకు చేరుకునే వారం. –శ్రీయ నిట్టూర్కర్

### రూ.17.5 లక్షలతో ప్యాకేజీతో ఉద్యోగాన్ని సాధించా



స్టాన్లీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ కోర్సును పూర్తి చేసి రూ.17.5 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాన్ని సాధించాను. ఫ్యాకల్టీ ప్రోత్సాహం, కళాశాలలో నిర్వహించిన సీఆర్టీ తరగతులు తనకు మంచి ఉద్యోగం రావడానికి ఉపయోగపడింది. ఫ్యాకల్టీల సూచనల మేరకు విద్యను అభ్యసించి మంచి ప్యాకేజీతో ఉద్యోగాన్ని సాధించడం సంతోషంగా ఉంది. కళాశాల యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు. – విజయ సింధూరి కాజ

### సీఆర్టీ తరగతులు మంచి ప్యాకేజీ సాధనకు దోహదపడ్డాయి



స్టాన్లీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సీఆర్టీ తరగతులు నిర్వహించడంతో పాటు పరీక్షలు నిర్వహించే వారు. అధ్యాపకులు జాతీయ స్థాయిలో జరిగే విద్యా పోటీలను తెలుసుకుని వాటిలో పాల్గొనేందుకు ప్రోత్సహించేవారు. జాతీయ స్థాయిలో జరిగిన ఐబీఎం హ్యాక్ చాలెంజ్‌లో పాల్గొని విజయం సాధించాను. కళాశాల అధ్యాపకులు అందించిన ప్రోత్సాహం, సీఆర్టీ తరగతులతో మంచి ప్యాకేజీతో ఎక్స్‌పీరియన్స్‌లో సాలీనా పదహారు లక్షల ప్యాకేజీకి ఎంపికై నేను ఉద్యోగం కూడా చేస్తున్నాను. మంచి ప్యాకేజీతో ఉద్యోగం రావడం ఎంతో సంతోషంగా ఉంది. – పులకుర్తి అనఘారెడ్డి